సాక్షి ఖమ్మం
ఆదివారం । 29 । జనవరి । 2023



భవనం.. అలంకారప్రాయం
గిరిజనులు శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఖమ్మంలో నిర్మించిన భవనం అలంకారప్రాయంగా మారింది. 8లో



అట్టహాసంగా ఎస్‌పీఎల్ టోర్నీ
సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. 10లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 33° / 19°
జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. తెల్లవారుజామున మంచుతో పాటు రాత్రి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఈవీఎంల తరలింపు పరిశీలన



ఈవీఎంల భద్రతపై చర్చిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: పాత కలెక్టరేట్‌లోని గోడౌన్‌లో ఉన్న ఈవీఎంలను జెడ్పీ ఆవరణలోని గోడౌన్‌కు శనివారం తరలించగా, ఈ ప్రక్రియను కలెక్టర్ వి.పి.గౌతమ్ పర్యవేక్షించారు. అలాగే జిల్లాకు నూతనంగా వచ్చిన 2,603 బ్యాలెట్ యూనిట్‌లు, 2,034 కంట్రోల్ యూనిట్లను జెడ్పీలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహించే పోలీసు గార్డులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, డీఆర్ఓ శిరీష, ఖమ్మం, కల్లూరు ఆర్డీఓలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ, ఈసీఐఎల్ ఇంజనీర్లు భానుప్రకాష్, రాజుశేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దశరథ్, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, ఎలక్షన్ తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఆయా పార్టీల ప్రతినిధులు పగడాల నాగరాజు, విద్యాసాగర్, గోపాలరావు, కృష్ణమోహన్, లక్ష్మీనారాయణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కుపై అవగాహన ఉండాలి
రాష్ట్ర స.హ. కమిషనర్ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

ఖమ్మం సహకారనగర్: సమాచార హక్కుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ డాక్టర్ జి.శంకర్ నాయక్ అన్నారు. స్థానిక ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్‌టీఐ చట్టం ద్వారా ప్రతి పౌరుడు తనకు కావాల్సిన సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థులు చదువుల్లో రాణించి దేశానికి సేవ చేసే స్థాయికి ఎదగాలన్నారు. తొలుత తెలుగు విభాగాధిపతి డాక్టర్ జర్పుల రమేష్ స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు. ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు బీవీ రెడ్డి, కేఎస్ఎస్ రత్నప్రసాద్, వివిధ విభాగాల బాధ్యులు రమా సత్యవతి, గోపి, సీతారాం, భట్టు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

ఖమ్మం సహకారనగర్: జేఈఈ మెయిన్స్ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. మూడు కేంద్రాల్లో 463 మంది అభ్యర్థులకు గాను 405 మంది హాజరయ్యారని పరీక్షల సిటీ కో ఆర్డినేటర్ పార్వతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు

ఖమ్మం వైద్యవిభాగం : బదిలీల సందర్భంగా అనారోగ్యంతో బాధపడే ఉపాధ్యాయులకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు ప్రారంభించారు. పరీక్షల నిర్వహణకు మెడికల్ బోర్డు ఏర్పాటు చేయగా, ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. గైనకాలజిస్ట్ కృపా ఉషశ్రీ, ఈఎన్‌టీ రామ్మూర్తి, ఆర్థోపెడిక్ బి. శ్రీనివాసరావు, జనరల్ మెడిసిన్ ఎం.నాగేశ్వరరావు, డెర్మటాలజీ అమర్‌సింగ్, జనరల్ సర్జన్ వెంకటేశ్వర్లు, డెంటిస్ట్ అశోక్‌కుమార్, కార్డియాలజిస్ట్ సీతారామ్, న్యూరో సర్జన్ చైతన్య, నెఫ్రాలజీ వేణుగోపాల్‌ను నియమించారు. ఉపాధ్యాయుల అనారోగ్య సమస్యను బట్టి బోర్డు మెడికల్ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. నకిలీ ధ్రువపత్రాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ బోర్డును ఏర్పాటు చేసిందని అధికారులు చెబుతున్నారు.

తుంబూరు వాసికి మిజోరాం కలెక్టర్ ప్రశంస

సత్తుపల్లిరూరల్: మండలంలోని తుంబూరు గ్రామానికి చెందిన పగుట్ల వెంకటేశ్వరరావు మిజోరాం రాష్ట్ర కలెక్టర్ నుంచి శనివారం ప్రశంసపత్రం అందుకున్నారు. ఆయన మిజోరాంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఎస్ఐఆర్‌డీపీఆర్ అధికారిగా విశేష సేవలందిస్తున్నారు. గ్రామ పంచాయతీలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామాభివృద్ధి ప్రణాళికను తయారు చేయడంలో చొరవ చూపడంతో పాటు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా విద్య, వైద్యం, మాతాశిశు సంరక్షణ శాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దీంతో మిజోరాంలోని లుంగిలేమ్ కలెక్టర్ కులోతుంగన్ చేతులమీదుగా వెంకటేశ్వరరావు ప్రశంసపత్రం అందుకున్నారు.



1,114 మందికి తప్పనిసరి..

విద్యాశాఖ రూపొందించిన విధి విధానాల మేరకు జిల్లాలో 1,114 మంది ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు బదిలీ అనివార్యం కానుంది. ఇందులో ఎనిమిదేళ్ల పూర్తి చేసుకున్న 1,060 మంది ఉపాధ్యాయులు, ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 54 మంది ప్రధానోపాధ్యాయులు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్‌జీటీలు, అందుకు సమానమైన కేటగిరీల వారికి డీఈఓ స్థాయిలో బదిలీలు ఉంటాయి. ప్రధానోపాధ్యాయులకు మల్టీ జోన్ స్థాయిలో ఆర్‌జేడీ బదిలీలు చేపడతారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటి నాటికి పదవీ విరమణకు మూడేళ్లలోపు గడువు ఉంటే ఆయా ప్రధానోపాధ్యాయులకు ఐదేళ్ల సర్వీస్ పూర్తయినా తప్పనిసరి బదిలీ నుంచి మినహాయిస్తారు. అయితే సదరు అభ్యర్థి దరఖాస్తు చేసుకుంటే పరిగణనలోకి తీసుకుంటారు. అలాగే ఎస్‌జీటీ, ఎస్‌ఏ, లాంగ్వేజ్ పండిట్, పీఈటీ తదితరులకు కూడా ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తయితే బదిలీ తప్పదు.

సందడి షురూ..

ఉపాధ్యాయ బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

- 1,114 మందికి తప్పనిసరి ట్రాన్స్‌ఫర్లు
- జిల్లాలో మొత్తం ఉపాధ్యాయులు 4,712 మంది
- వీరిలో 95 శాతం మందికి బదిలీలకు అర్హత
- చెక్ స్లిప్ బదిలీలపై ఉపాధ్యాయ సంఘాల అసంతృప్తి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల కోలాహలం ప్రారంభమైంది. ఈ ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్, విధి విధానాలను విద్యాశాఖ విడుదల చేయడంతో ఉపాధ్యాయులు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు, ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులకు తప్పనిసరిగా బదిలీ కానుంది. జిల్లాలో దాదాపు 95 శాతం మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఇదిలా ఉండగా.. చెక్‌స్లిప్ బదిలీల పట్ల ఉపాధ్యాయ సంఘాలు అసంతృప్తితో ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ తరహా బదిలీలను అనుమతించవద్దని ఆయా సంఘాల నేతలు కోరుతున్నారు.

మొదలైన సందడి..
జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియకు తెరలేచింది. శనివారం నుంచి ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో బదిలీల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈనెల 30 వరకు దరఖాస్తులకు అవకాశం ఉంది. జిల్లాలో మొత్తం 1,425 పాఠశాలల్లో 4,712 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో 317 జీఓ కింద బదిలీపై వచ్చిన వారు సుమారు 500 వరకు ఉంటారని అంచనా. వీరు మినహా దాదాపు 4,212 మంది వరకు రెండేళ్ల సర్వీస్ పూర్తయింది. వీరంతా బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. స్పౌజ్ కింద బదిలీపై వచ్చే వారు 38 మంది ఉన్నారు. ఇక ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ చేపట్టే కమిటీలో చైర్‌పర్సన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్, సభ్యుడిగా జెడ్పీ సీఈఓ, సెక్రటరీ, సభ్యుడిగా డీఈఓ ఉంటారు. జిల్లా పరిషత్, ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన కమిటీలో చైర్‌పర్సన్‌గా జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా అడిషనల్ కలెక్టర్, జెడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉంటారు. సభ్యుడు, సెక్రటరీగా డీఈఓ ఉంటారు.

చెక్‌స్లిప్ బదిలీలపై అభ్యంతరం..
జిల్లాలో నలుగురు ఉపాధ్యాయులకు చెక్‌స్లిప్ బదిలీలు జరిగాయి. ఈ ప్రక్రియపై ఉపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. బదిలీల షెడ్యూల్ విడుదలైన సమయంలో చెక్‌స్లిప్ బదిలీలకు అవకాశం ఇవ్వడం సరికాదని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇటువంటి చర్యలతో సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులు మళ్లీ అక్కడే విధులు నిర్వహించాల్సి వస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మరో 20 నుంచి 30 మంది వరకు ఉపాధ్యాయులకు చెక్‌స్లిప్ బదిలీలు జరిగే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

పారదర్శకంగా బదిలీలు చేపట్టాలి



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలి. నేను ఐదు సంవత్సరాలకు పైగా తొడితలగూడెం యూపీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నా. ఇటీవలి కాలంలో జరుగుతున్న బదిలీల వల్ల నాకు మళ్లీ సుదూర ప్రాంతానికే బదిలీ జరుగుతుందనే ఆందోళన ఉంది. అలా కాకుండా అందరికీ న్యాయం జరిగేలా బదిలీలు ఉండాలి.
– బి.దేవ్‌సింగ్, ఎల్‌పీటీ, యూపీఎస్, తొడితలగూడెం, సింగరేణి మండలం

ఇబ్బందులు లేకుండా చూడాలి..



ఉపాధ్యాయ బదిలీల్లో ఎలాంటి అవకతవకలు, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టి అర్హులైన వారందరికీ న్యాయం జరిగేలా చూడాలి. అనేక సంవత్సరాలుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్న వారందరికీ ఇప్పుడు న్యాయం జరుగుతుందనే ఆశ ఉంది. అయితే ఇటీవల జరుగుతున్న పలు బదిలీల నేపథ్యంలో మాకు ఎక్కడికి బదిలీ జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది.
– ఎస్.నవీన్‌కుమార్, ఎస్‌ఏ, జెడ్పీఎస్ఎస్, ఎం.వి.పాలెం, ఖమ్మంరూరల్ మండలం

ఇక వేగవంతం..

ఖమ్మం సహకారనగర్ : ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ వేగవంతంగా జరగనుంది. ఎస్‌జీటీలు ఎస్‌ఏలుగా పదోన్నతి పొందే ప్రక్రియ నేటి నుంచి కొనసాగనుండగా, బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. తొలిరోజు శనివారం ఆన్‌లైన్‌లో సుమారు 850 దరఖాస్తులు వచ్చినట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. కాగా ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండడంతో ఇంకా భారీగా అప్లికేషన్లు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

నేటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్
ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎస్‌జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల కోసం సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్లు డీఈఓ సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులంతా వారి అర్హత సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్లతో పాత డీఈఓ కార్యాలయానికి యంకు ఈ నెల 29 నుంచి 31వరకు హాజరుకావాలని కోరారు. జాబితాలో అభ్యంతరాలుంటే అప్పీల్‌కు తగు ధ్రువీకరణ పత్రాలతో వారికి కేటాయించిన కౌంటర్‌లో అందించాలని సూచించారు.

క్షణాల్లో కాజేశారు..

- భూ అక్రమార్కుడి మరో లీల
- 'రెవెన్యూ' సహకారంతోనే!
- ఎమ్మెల్యేకు బాధితుల ఫిర్యాదు
- పరిశీలనకు 1న కలెక్టర్ రాక



ఎమ్మెల్యే వెంకటవీరయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం గంగారంలోని బేతుపల్లి రెవెన్యూ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. 'పెద్దిరికం పేరిట కబ్జా', 'కన్నుపడితే ఖతమే!' శీర్షికలతో సాక్షిలో ప్రచురితమైన వరుస కథనాలతో బాధితుల్లో భరోసా వచ్చింది. పెద్దమనిషి ముసుగులో అక్రమార్కుడు చేసిన భూ బదలాయింపులపై బాధిత రైతులు ఫిర్యాదు చేసేందుకు ముందుకొస్తున్నారు. రెవెన్యూ శాఖలోని ఉద్యోగుల సహకారంతోనే అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. బేతుపల్లి సర్వే నంబర్లలోని మిగులు భూమి ఎవరి వద్ద ఉందో సదరు పెద్దమనిషికి సమాచారం ఇచ్చి మరీ కార్యాలయానికి పిలిపించి అతడికి ఓ రెవెన్యూ ఉద్యోగి సహకరించినట్టు ఒక్కో ఘటన ద్వారా తెలుస్తోంది. 'సాక్షి'లో వస్తున్న వరుస కథనాలపై కలెక్టర్ వీపీ గౌతమ్ తహసీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా, ఆయన గంగారం వివాదాస్పద భూమిని పరిశీలించారు.

రిజిస్ట్రేషన్ భూమి బదలాయింపు..
సత్తుపల్లి మండలం బేతుపల్లి సర్వే నంబర్ 133/164/4లోని ముత్తా వెంకటేశ్వరరావు పేరున ఉన్న రెండెకరాల భూమిని క్షణాల్లో అక్రమార్కుడి అనుచరుడి పేరున మార్చడం వివాదాస్పదమవుతోంది. వంశపారంపర్యంగా వస్తున్న భూమిని ఇతరుల పేరున మార్చడంపై వెంకటేశ్వరరావు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి ధరణి ఆపరేటర్ చెన్నారావు అలియాస్ సురేష్ ఫోన్ చేసి 'మీ పాస్ పుస్తకంలో మిగులు భూమి ఉంది. వెంటనే సరి చేసుకోండి. త్వరగా వచ్చేసి వేలిముద్ర(బయోమెట్రిక్) వేస్తే భూమి సరి చేస్తాం' అని నమ్మబలికి వేలిముద్ర వేయించుకున్నాడని ముత్తా వెంకటేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. వెంటనే ఆ భూమి సమయమంతుల హరికృష్ణ పేరుమీద మారిపోవడంతో తన భూమి పేరు మారిందంటూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా చేస్తాం.. చూస్తాం అంటూ తిప్పుకుంటున్నారని వెంకటేశ్వరరావు లబోదిబోమంటున్నాడు.

'ధరణి' లొసుగులతోనే..
ధరణిలోని లొసుగులే రెవెన్యూ శాఖకు వరంగా మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. భూమి క్రయవిక్రయాలప్పుడు పాస్ పుస్తకాల్లో ఉంటే చాలు.. క్షేత్రస్థాయి పరిశీలన చేయాల్సిన అవసరం లేకపోవడంతోనే అక్రమాలకు తెరలేపినట్టు ప్రచారం సాగుతోంది. బేతుపల్లి సర్వే నంబరు పెద్దది కావటం.. ఇటీవలే ఎంజాయ్‌మెంట్ సర్వే చేసి భూముల క్రమబద్ధీకరణ చేయటం, కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వడంతో అక్రమాలకు అనువుగా మార్చుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. భూమి ఉన్నా.. పాస్‌పుస్తకం లేకుండా ఎంతోమంది రైతులు పడుతున్న అవస్థలను గుర్తించిన ప్రభుత్వం ఎంజాయ్‌మెంట్ సర్వే చేస్తే దానికి కూడా వక్రభాష్యం చెబుతూ మిగులు భూమి పేరుతో రెవెన్యూ శాఖలోని కొందరు ఉద్యోగులు అక్రమార్కులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

రైతే వచ్చి వేలిముద్ర వేశాడు

ముత్తా వెంకటేశ్వరరావు స్వయంగా వచ్చి బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర వేయడం వల్లే భూమి రిజిస్ట్రేషన్ అయింది. దీంట్లో ఎవరి ప్రమేయం లేదు. దీనికి సంబంధించిన రెవెన్యూలోని సీసీ పుటేజీ, ఫొటో కూడా రిజిష్టర్ అయింది. మిగులు భూమి పేరుతో పిలిచి వేలిముద్ర వేయించారనే ఆరోపణలు అవాస్తవం.
– టి.శ్రీనివాసరావు, సత్తుపల్లి తహసీల్దార్

ఎమ్మెల్యేకు ఫిర్యాదు..
సమయమంతుల ముత్యాలరావు కుటుంబానికి అప్పు ఇచ్చి సెటిల్‌మెంట్ చేస్తానని చెప్పిన పెద్దమనిషి తమను బెదిరించి భూములు లాక్కున్నాడని స్థానిక ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు బాధితులు శనివారం ఫిర్యాదు చేశారు. రూ.కోట్ల విలువైన భూములను బెదిరించి లాక్కుంటున్నాడని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని వాపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. వచ్చేనెల 1న కలెక్టర్ పరిశీలనకు వస్తున్నారని, ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. దందాపై వివరాలు సేకరించాలని ఏసీపీ ఎన్.వెంకటేష్‌కు సూచించారు.

'పాలేరు'కు వందేళ్లు



పాలేరు రిజర్వాయర్

SUNDAY SPECIAL

- నైజాం కాలంలో తవ్విన చెరువు
- రిజర్వాయర్‌గా మారడంతో కల్పతరువు
- 8 లక్షల మందికి తాగునీరు.. 6 లక్షల ఎకరాలకు సాగు నీరు..
- చేపల పెంపకంతో మత్స్యకారులకు ఆదెరువు



నైజాం నవాబు కాలంలో నిర్మించిన చెరువు కట్ట

కూసుమంచి: పాలేరు చెరువుకు వందేళ్లు పూర్తయ్యాయి. ఈ చెరువే నేడు రిజర్వాయర్‌గా మారి జిల్లాలో ప్రాచుర్యం పొందింది. 1922లో ఆరవ నైజాం నవాబు మీర్ మహబూబ్ ఆలీ పాలనలో పాలేరులో సుమారు 800 ఎకరాల్లో చెరువు నిర్మాణ పనులు ప్రారంభించగా, 1928లో పనులు పూర్తయి వందలాది ఎకరాలకు సాగునీరు అందించింది. నాటి కాలంలో ఇదే పెద్ద చెరువు.

అద్భుత నిర్మాణం..
పాలేరు చెరువును నాటి చీఫ్ ఇంజనీర్ నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ బహదూర్ పర్యవేక్షణలో నిర్మించారు. ఈ చెరువు తూములు, ఆనకట్టల నిర్మాణం అద్భుతంగా సాగింది. చతురస్రాకారంలో ఉన్న నున్నటి బండరాళ్లు ఒకదానిపై ఒకటి పేర్చి వాటి మధ్యలో సీసం, దంగుసున్నం, బంకమట్టి వేసి నిర్మించారు. చెరువు నిండా నీరున్నా నేటి వరకు ఒక్క చుక్క కూడా లీక్ కావడం లేదంటే నాడు చేపట్టిన పనులు అద్భుతంగా ఉండడమే కారణమని పలువురు అంటున్నారు.

చెరువు నుంచి రిజర్వాయర్‌గా..
1975లో నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సాగర్ కాలువను పాలేరు చెరువుకు అనుసంధానించి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చారు. 2.5 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యంతో దీన్ని నిర్మించారు. దీని పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు. మరో ప్రత్యేకత ఏంటంటే ఈ రిజర్వాయర్ నిండినా ఎలాంటి ప్రమాదం లేకుండా వాటంతట అవే పడిపోయేలా ఫాలింగ్ గేట్లు అమర్చడం. ఈ తరహా గేట్ల అమరిక పాలేరు రిజర్వాయర్‌కే సొంతం.

జిల్లాకు కల్పతరువు..
పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ జిల్లాకే కల్పతరువు. రైతులకు, మత్స్యకారులకు వరప్రదాయిని. సాగర్ జలాలు పాలేరు రిజర్వాయర్‌కు చేరడంతో జిల్లాలో సాగర్ రెండో జోన్ ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. ఖమ్మం, కృష్ణా జిల్లాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఎడమ కాలువ తవ్వారు. జిల్లాలో 16 మండలాల పరిధిలో 80 కిలోమీటర్ల మేర ఈ కాలువ సాగుతోంది. దీని ఆయకట్టు పరిధిలో 2.80 లక్షల ఎకరాల్లో వరి, మరో 3 లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలు పండిస్తున్నారు. ఈ కాలువ పరిధిలో 119 మేజర్లు, 3,090 మైనర్లు, సబ్‌మైనర్లు, 223బ్రాంచ్ కెనాల్స్ ఉన్నాయి. ఎడమ కాలువ పరిధిలోనే కాకుండా పాలేరు రిజర్వాయర్ కాలువ (పాతకాలువ) ద్వారా కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో వరి, చెరకు పంటలకు సాగునీరు అందుతోంది. అంతేకాకుండా భక్త రామదాసు ప్రాజెక్టుతో పాలేరు నియోజకవర్గంలో వందలాది ఎకరాలు సాగవుతున్నాయి.

దాహార్తి తీరుస్తూ..
పాలేరు రిజర్వాయర్ జిల్లా ప్రజల దాహార్తిని కూడా తీరుస్తోంది. ఎడమ కాలువ ద్వారా మున్నేరుతోపాటు వందలాది చెరువులు నింపి తాగునీరు సరఫరా చేస్తున్నారు. పాలేరులో నిర్మించిన డీఫ్లోరైడ్ ప్రాజెక్టులు, మిషన్ భగీరథ ప్రాజెక్టుల ద్వారా 8 లక్షల మందికి రక్షిత తాగునీరు అందుతోంది.

మత్స్యకారులకు సిరులతల్లి..
పాలేరు రిజర్వాయర్ మత్స్యకారులకు సిరులతల్లి. దీనిపై ఆధారపడి సుమారు 2వేల మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇక్కడ మంచినీటి రొయ్యలు, చేపలు ప్రత్యేకం. వీటి ద్వారా ఏటా కోట్ల రూపాయల వ్యాపారం సాగుతుంది. ఇక్కడి రొయ్య దేశ, విదేశాల్లో పేరుగాంచింది. ఇక చేపలకు సైతం దేశీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుంది. ఏటా సుమారు 150 నుంచి 200 టన్నుల చేపలు ఈ రిజర్వాయర్‌లో లభిస్తుండడం విశేషం.

అన్నదాతకు ఆదెరువు



పాలేరు చెరువు ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతోంది. జిల్లాలోని రైతులకు ఈ చెరువే ఆదెరువుగా మారింది. సాగర్ నీటితో రెండు పంటలు పండుతున్నాయి. మా ఊరిలో ఈ చెరువు ఉండడం అదృష్టం.
– ఎడవెల్లి రాంరెడ్డి, పాలేరు

మాకు బతుకునిస్తోంది...



పాలేరు చెరువులో మేం కొన్ని సంవత్సరాల నుంచి చేపల వేట సాగిస్తూ వందలాది మందిమి బతుకుతున్నాం. ఇది పెద్ద చెరువు కావడంతో మాకు చేపలు, రొయ్యలు దొరుకుతున్నాయి. ఈ చెరువు రుణం ఎన్నటికీ తీర్చుకోలేము.
– బత్తుల ఉప్పలయ్య, మత్స్యకారుడు

క్లుప్తంగా

కంటి వెలుగును సమర్థంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మాలతి

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మాలతి అన్నారు. జెడ్పీ హాల్లో శనివారం కంటి వెలుగు కార్యక్రమంపై రీ ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కంటి వెలుగు బృందాలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ శిబిరాలకు వచ్చే వారికి సరైన రీతిలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వెంటనే కళ్లద్దాలు అందజేయాలన్నారు. ప్రిస్కిప్షన్ గ్లాసులు అవసరమైన వారికి ఆన్లైన్ పూర్తి చేయాలని, వారికి 15 రోజుల్లో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీధర్గౌడ్, సైదులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకుడు దయానంద్‌కు గుండెపోటు



దయానంద్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పెనుబల్లి: సత్తుపల్లికి చెందిన సీనియర్ నాయకుడు, దిశ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ శనివారం అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. పెనుబల్లి మండలంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా కుప్పకూలి పడిపోయారు. దీంతో ఆయన అభిమానులు, స్థానికులు వెంటనే డాక్టర్ దయానంద్‌ను కారులో సత్తుపల్లికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షల అనంతరం ఖమ్మం, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

అందరూ భాగస్వాములు కావాలి

కామేపల్లి(కారేపల్లి): బాలకార్మికుల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని, ఎవరైనా బాలలను పనిలో కుదుర్చుకొని వారితో పనులు చేయించినట్లయితే వారి వివరాలను పోలీసులకు ఇవ్వాలని జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చల్లా వెంగమ్మ తెలిపారు. శనివారం మండల పరిధిలోని ముచ్చర్ల క్రాస్‌రోడ్డు సమీపంలో ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న బాలకార్మికుడిని బాలకార్మికుల నిర్మూలన వ్యవస్థ, ఆపరేషన్ స్మైల్ టీం సభ్యులు గుర్తించారు. అనంతరం కామేపల్లి పోలీస్ స్టేషన్‌లో బాలుడితో పనిచేయిస్తున్న ఇటుక బట్టీ యజమానిపై ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ జె.రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్లంలో మిర్చి దగ్ధం

కూసుమంచి: మండలంలోని నేటపట్ల గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో కల్లంలోని మిర్చి దగ్ధమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జాల భిక్షం మిర్చి ఏరించి సుమారు 15 క్వింటాళ్ల మిర్చిని తన చేలోనే కల్లం చేసి ఆరబోశాడు. శనివారం సమీపంలోని బీడులో మంటలు వ్యాపించి అవి కల్లంలోని మిర్చికి అంటుకున్నాయి. సుమారు 5 క్వింటాళ్ల మేర కాయలు కాలిపోయాయి. గమనించిన రైతు, సమీపంలోని కూలీలు పరుగున వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంతో తనకు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఈ ఘటనపై బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



తేలూరి రమేశ్ (ఫైల్)

రఘునాథపాలెం: కత్తి దాడికి గురై తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు శని వారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన తేలూరి రమేశ్ (35) ఈ నెల 12వ తేదీన రాత్రి 8.30 గంటల సమయంలో ఎస్సీకాలనీలోని సెంటర్‌లో ఉన్నాడు. అదే కాలనీకి చెందిన బలవంతపు నాని అక్కడకు వచ్చి రమేశ్‌ను రూ.100 అడిగాడు. రమేశ్ తన వద్ద లేవని చెప్పాడు. వెంటనే నాని చిన్నపాటి కత్తి తీసుకొచ్చి డబ్బులు అడిగితే లేవంటావా అని మద్యం మత్తులో దాడి చేశాడు. ఈ క్రమంలో రమేశ్ అడ్డుకునే ప్రయత్నం చేశాడు. చేతికి గాయమైన తర్వాత పొట్టపై బలమైన గాయం అయింది. వెంటనే కుటుంబ సభ్యులు రమేశ్‌ను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పొట్ట లోపల తీవ్ర గాయం కావడంతో పరిస్థితి విషమించి శని వారం రమేశ్ మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. కాగా, నిందితుడిని ఘటన జరిగిన రోజునే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రవి వెల్లడించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

భవనం.. అలంకార ప్రాయమే!

- గిరిజన భవనం ప్రారంభించి వదిలేసిన వైనం
- అద్దెకు ఇస్తే ఆదాయం వస్తుందని తెలిసినా నిర్లక్ష్యం
- అడ్డాగా మార్చుకుంటున్న మందుబాబులు





అన్ని హంగులతో నిర్మించిన గిరిజన సంక్షేమ భవనం, (ఇన్‌సెట్) భవనం డోర్ వద్ద మద్యం సీసా

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం జిల్లా కేంద్రంలో గిరిజనుల కోసం నిర్మించిన భవనం అలంకారప్రాయంగా మారింది. గిరిజనుల సమావేశాలు, శుభకార్యాలకు, ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందనే భావనతో ప్రభుత్వం రూ.1.10 కోట్ల నిధులు కేటాయించింది. అనేక అవాంతరాల నడుమ నిర్మాణం పూర్తయిన గిరిజన సంక్షేమ భవనాన్ని గతేడాది మే 24న గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉన్నా... ప్రారంభించిన రోజు వేసిన తాళం మళ్లీ తీయకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు అవగాహన కల్పించపోగా.. నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండం గమనార్హం.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

గిరిజన సంక్షేమ భవనం నిర్వహణ బాధ్యతలు చూస్తూనే.. అందులో గిరిజనులు, గిరిజనేతరులు సమావేశాలు, ఫంక్షన్లు నిర్వహించుకునేలా అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు భవనం తమ పరిధిలోనిది కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇక వాచ్‌మెన్‌కు సైతం భవనం వద్ద కాకుండా గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి కార్యాలయం వద్ద విధులు కేటాయించడంతో పట్టించుకునే వారే కరువయ్యారు. ఇదే అదునుగా తీసుకున్న పలువురికి సాయంత్రమైతే చాలు ఇక్కడ మద్యం సేవించడం అలవాటుగా మారింది. దీంతో గిరిజన సంక్షేమం పేరిట నిర్మించిన భవనం అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దెకు ఇస్తే ఆదాయం, అభివృద్ధి

ఎస్సీలకు జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనం నిర్మించినట్లుగానే గిరిజనుల కోసం గిరిజన సంక్షేమ భవనాన్ని ప్రభుత్వం నిర్మించింది. రూ.కోటికి వెచ్చించగా ఇప్పటి వరకు అద్దెకు ఇవ్వలేదు. గిరిజనుల అవసరాలకైతే రూ.10 వేలు, గిరిజనేతులకు ఇస్తే రూ.15 వేలు వసూలు చేయాలని శాఖ అధికారులు నిర్ణయించారు. వస్తు ప్రదర్శనలు, బుక్‌ఫెయిర్లు, ఫంక్షన్లు, సమావేశాలకు అద్దెకు ఇవ్వనున్నట్లు విస్తృతంగా ప్రచారం చేస్తే ఆదాయం సమకూరేది. అంతేకాక నిర్వహణ, అభివృద్ధి సులువయ్యేది. కానీ ఆ దిశగా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆదాయం కోల్పోతున్నట్లవుతుందని గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి.

అద్దెకు ఇస్తాం..

ఖమ్మంలో నిర్మించిన గిరిజన సంక్షేమ భవనాన్ని ఫంక్షన్లు, ప్రదర్శనలు, సమావేశాల కోసం ఎవరైనా ఆసక్తి చూపిస్తే అద్దెకు ఇస్తాం. భవనం చుట్టూ ప్రహరీ సరిగ్గా లేదు. ఇందుకోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. రాత్రి వేళ విధులు నిర్వర్తించేలా వాచ్‌మెన్‌ను నియమించాం.

– కృష్ణనాయక్, ఎస్టీ డీడీ, ఖమ్మం

కార్యకర్తలు లేనిదే పార్టీ లేదు..

బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ నామ

ఖమ్మంమయూరిసెంటర్: కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని, వారు లేనిదే పార్టీ లేదని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. దమ్మపేట మండలం నల్లకుంట గ్రామానికి చెందిన 25 మంది యువకులు దమ్మపేట మండలం మందలపల్లికి చెందిన దిశ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు గారపాటి సూర్యం నాయకత్వంలో శనివారం ఖమ్మంలోని నామ స్వగృహంలో ఎంపీ నామ నాగేశ్వరరావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీ నామ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలు లేనిదే పార్టీ లేదని, వారు పార్టీకి పునాదులు, సేనాధిపతులని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తెలంగాణ మోడల్ పథకాలు అమలు చేయాలనే ఆలోచనతోనే కేసీఆర్ బీఆర్ఎస్‌ని స్థాపించారని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చమటోడ్చి పని చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో న్యాయవాది సోడెం వెంకట్, అద్దంకి మధు, కనపర్తి ధర్మారావు, సీహెచ్ భాగ్యరాజు, నందికోల రామారావు, మద్దెల పుల్లారావు, ఐనంపూడి సంతోష్, ఎడవల్లి కుమార్, తోట గోపి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నల్లమల వెంకటేశ్వరరావు, చిత్తారు సింహాద్రియాదవ్, గోడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఏసీపీలు బదిలీ



బదిలీ అయిన ఏసీపీ ఆంజనేయులు



నూతన ఏసీపీ పీవీ గణేశ్



బదిలీ అయిన సత్తుపల్లి ఏసీపీ వెంకటేశ్

ఖమ్మంక్రైం: నగర ఏసీపీ ఆంజనేయులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన స్థానంలో పంజాగుట్ట ఏసీపీగా పనిచేస్తున్న పీవీ గణేశ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో పలువురు డీఎస్పీలు బదిలీఅయ్యారు. అందులో భాగంగా జిల్లాలో సత్తుపల్లి ఏసీపీగా పనిచేస్తున్న వెంకటేశ్‌ను పాల్వంచ డీఎస్పీగా బదిలీ చేశారు. చాలాకాలం తర్వాత ఖాళీగా ఉన్నఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా మిర్యాలగూడెం డీఎస్పీగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును నియమించారు. ఖమ్మం ఏసీపీగా పనిచేస్తున్న ఆంజనేయులను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

జమలాపురంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీస్వామివారి పాదానికి వేదమంత్రోచ్ఛారణ నడుమ పంచామృతంతో అభిషేకం చేశారు. శ్రీవారిని, అలివేలు మంగ, పద్మావతి అమ్మ వార్లను పట్టువస్త్రాలతో అలంకరించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల భక్తులు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, పలువురు జర్నలిస్టులు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీవారికి నిత్యకల్యాణం, పల్లకీ సేవలు చేశారు. ఆలయ ఈవో జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు. కాగా, జమలాపురం గ్రామంలోని టీటీడీ సత్రంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, పలువురు జర్నలిస్టులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ చావా రామకృష్ణ, స్థానిక సర్పంచ్ ముల్పూరి స్వప్న, సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావు సూరానేని రామకోటేశ్వరరావు, సంక్రాంతి కృష్ణారావు, సగ్గుర్తి కిశోర్, పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డి, కొండెపాటి సాంబశివరావు, శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఇనపనూరి భాస్కర్, దేవరకొండ రవి పాల్గొన్నారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి

చింతకాని: దళితబంధు పథకం ద్వారా మంజూరైన యూనిట్లను దళితులందరూ సక్రమంగా వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఆకాంక్షించారు. మండలంలోని నాగులవంచ గ్రామంలో దళితబంధు లబ్ధిదారులకు మంజూరైన యూనిట్లను జెడ్పీ చైర్మన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమల్‌రాజ్ మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకంతో దళితులందరూ ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి యూనిట్ల నిర్వహణ తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పర్చగాని తిరుపతికిశోర్, కోపూరి పూర్ణయ్య, గురిజాల హనుమంతురావు, మంకెన రమేశ్, ఆలస్యం నాగమణి, చాట్ల సురేశ్, బొడ్డు వెంకట్రామయ్య, వంకాయలపాటి లచ్చయ్య, గడ్డం శ్రీను, అంబటి వెంకటి, సైదేశ్వరరావు, సామినేని బాబూరావు, సిలివేరు సైదులు, వంకాయలపాటి శివ, భైరు లక్ష్మణ్, కొల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

కూలీల వ్యాన్ బోల్తా

కూసుమంచి: మండలంలోని దుబ్బతండా వద్ద శనివారం కూలీలతో వెళ్తున్న వ్యాను అదుపుతప్పి పొలాల్లో బోల్తా కొట్టింది. సమీప సూర్యాపేట జిల్లాలోని నేరేడువాయితండా కూలీలు వ్యాన్‌లో మండలంలోని లాల్‌సింగ్‌తండా వెళ్తున్నారు. ఈ క్రమంలో దుబ్బ తండా వద్దకు రాగానే వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలంలో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో వ్యానులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

యువకుడు ఆత్మహత్య

చింతకాని: తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన కొమ్ము సాయి (17) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. తల్లి మందలించిదని మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మధిర మండలంలో పొంగులేటి పర్యటన



పొంగులేటిని సత్కరిస్తున్న గ్రేస్ కళాశాల సిబ్బంది

మధిర: మండలంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం విస్తృతంగా పర్యటించారు. శ్రీరస్తు ఫంక్షన్‌హాల్లో జరుగుతున్న ముక్కర లక్ష్మారెడ్డి కుమారుడి వివాహ వేడుకకు హాజరయ్యారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, వంగవీడు గ్రామంలో ఐలూరి జనార్దన్‌రెడ్డి ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకోగా ఆయనను పరామర్శించారు. శీలం గోపాలరెడ్డి సతీమణి అన్నపూర్ణమ్మ మృతి చెందగా దశదినకర్మకు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, తుళ్లూరు బ్రహ్మయ్య, కోట రాంబాబు, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, ఎర్రగుంట రమేశ్, బండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవండి..

కొణిజర్ల: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం తనికెళ్లలోని గ్రేస్ జూనియర్ కళాశాలలో ఇంటర్, ఎంఎల్‌టీ గ్రూపు విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, పెద్దమునగాల సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు, రాయల పుల్లయ్య, గుండ్ల కొటేశ్వరరావు, గడల నరేంద్రనాయుడు, కనగంటి రావు, మోష రామకోటయ్య, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దారి ఆక్రమణపై క్షేత్రస్థాయిలో సర్వే



భూమి పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: పంటలు సాగు చేసుకోకుండా దారిని కబ్జా చేయడంతో రెండేళ్ల నుంచి పంటలు బీళ్లుగా మారాయని పలువురు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. శనివారం మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన గిరిజన రైతులకు చెందిన 50 ఎకరాలకు వెళ్లే దారిని గ్రామంలో కొంత మంది కబ్జా చేసిన విషయంపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. రహదారిని ఆక్రమించడంతో రెండేళ్ల నుంచి పంటలు వేయకుండా బీళ్లుగా ఉంచాల్సిన దుస్థితిలో ఉన్నామని గిరిజన రైతులు వాపోయారు. సర్వేలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ లూర్దు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. అనంతరం సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో తహసీల్దార్ దారా ప్రసాద్, మండల సర్వేయర్ జయంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడారు. ఆక్రమణల నుంచి దారికి విముక్తి కల్పించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధిత రైతులు భూక్యా రవికుమార్, బానోత్ రంజిత్‌నాయక్, మాలోత్ బాలు, భూక్యా వెంకటేశ్వర్లు, భూక్యా రమాదేవి, బి.భారతి, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మార్కెట్ అభివృద్ధి

ఖమ్మం మార్కెట్ కమిటీ వీడ్కోలు సమావేశంలో చైర్‌పర్సన్ డౌలే లక్ష్మీప్రసన్న



చైర్‌పర్సన్ లక్ష్మీప్రసన్న, డైరెక్టర్లను సన్మానిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారి, బృందం

ఖమ్మంవ్యవసాయం: రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, ప్రజలు, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరుల సహకారంతో శక్తి మేరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేశానని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ డౌలే లక్ష్మీప్రసన్న అన్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ప్రస్తుత కమిటీ వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చైర్‌పర్సన్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. ఏడాదిన్నర కాలంలో అందరి సహకారంతో మార్కెట్ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకున్నామని తెలిపారు. పత్తి, మిర్చి ధరలు పెరగటంతో రైతులకు మేలు జరగటంతో పాటు మార్కెట్‌కు ఆదాయం కూడా పెరిగిందని, తాను పదవిలో చేరిన సమయంలో రూ.13 కోట్లుగా ఉన్న ఆదాయం ఏకంగా రూ.20 కోట్లకు చేరిందన్నారు. మార్కెట్ ఆర్థికాభివృద్ధి గడించటం, రైతులకు అందించిన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రాష్ట్రంలో రెండో స్థానం ఇచ్చిందని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని యార్డుల అభివృద్ధికి కృషి చేశామని, మిర్చి యార్డులో లక్ష బస్తాల వరకు విక్రయాలు జరిగే విధంగా ఏర్పాట్లు చేశామని, మార్కెట్ యార్డుల్లో శిథిలమైన భవనాలు, షెడ్ల స్థానంలో నూతన భవనాలు, షెడ్లు, రహదార్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రి అజయ్‌కుమార్ సహకారంతో రూ.10.34 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నారని చెప్పారు. రైతుల పంటల కాంటాల్లో ఇబ్బందులు, అవకతవకలు చోటు చేసుకోకుండా రూ.40 లక్షల వ్యయంతో 100 పాయింట్ ఆఫ్ సేల్ మిషన్లను కొనుగోలు చేశామని వెల్లడించారు. దేశ, విదేశాలకు రవాణా చేసే మిర్చి నాణ్యతను గుర్తించేందుకు మూడు యంత్రాలను రైతులకు అందుబాటులో ఉంచామని వివరించారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కోలాహలం నాగరాజు, మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేషం మాట్లాడుతూ.. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తొలిమహిళా చైర్‌పర్సన్‌గా నియమితులైన లక్ష్మీప్రసన్న ఉన్నతమైన సేవలందించి గుర్తింపు సాధించారన్నారు. మహిళా చైర్‌పర్సన్ కాలంలో మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. మార్కెట్ డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు మాట్లాడుతూ.. కమిటీ పనితీరును ప్రశంసించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లక్ష్మీప్రసన్న, సాయికిరణ్ దంపతులను, డైరెక్టర్లను శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ గ్రేడ్-2 కార్యదర్శి బి.బజార్, సహాయ కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, నిర్మల పాల్గొన్నారు.